చేనుకు రక్ష.. భూసార పరీక్ష

- 67 వేల ఎకరాల్లో వివిధ పంటలు
- సస్యరక్షణపై శ్రద్ధ అవసరం

సీతానగరం: భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు.. వేసే పంటలు, వాడే క్రిమి సంహారకాలు, ఎరువులను బట్టి మార్పు చెందుతోంది. ఆ మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుని వ్యవసాయం చేస్తేనే మంచి దిగుబడులు సాధించవచ్చు. రైతులు అనువైన సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. రబీలో వేసిన పంట రెండు నెలల్లో రైతుల చేతికి వస్తుంది. అనంతరం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రైతులు తమ పంట పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవడానికి సమాయత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తగ్గనున్న పెట్టుబడి ఖర్చు

రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలంలో 20 వేల ఎకరాలు, కోరుకొండ మండలంలో 22 వేలు, రాజానగరం మండలలో 25 వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, జొన్న, కూరగాయల పంటలు, పాదులు, బొప్పాయి, అరటి, చెరకు, మామిడి, జీడిమామిడి వంటి ఫలసాయ వివిధ పంటలను రైతులు పండిస్తున్నారు. భూమికి ఎంత శాతం లవణాలు, మూలకాలు, ఖనిజాలు అవసరమో తెలియకుండా ఎరువులు వాడుతున్నారు. ఫలితంగా పెట్టుబడి ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఈ నేపథ్యంలో ఎరువుల వినియోగంలో అనవసర ఖర్చులు తగ్గించేందుకు భూసార పరీక్షలు అవసరం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో భూసార పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కల్పించింది. భూమిలో ఉన్న పోషకాలే కాకుండా, చౌడు గుణాలు, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడతాయి.


పొలంలో మట్టి నమూనాను సేకరిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఇలా చేయాలి..

నల్లచౌడు, ఆమ్ల నేలను పీహెచ్ మీటర్ ద్వారా తెలుసుకోవచ్చు. పొలాల్లో రసాయన ఎరువులు ఎక్కువగా వాడుతుండటంతో చౌడు శాతం పెరుగుతోంది. దీని నివారణకు సేంద్రియ ఎరువులు ఉపయోగించాలి. జీలుగతో నల్లచౌడు పోతుంది. ఉప్పు నేలలను తెలుసుకోవడానికి కండక్టివ్ మీటర్‌ను ఉపయోగిస్తారు. పొలాల్లో తెల్లగా పేరుకుపోయి ఉంటుంది. ఎక్కడైతే ఒక శాతం కన్నా ఎక్కువ ఉంటే పొలాన్ని బాగా దున్నేసి ఒక రోజు వరకూ నీరు నిల్వ చేయాలి. ఆ తర్వాత నీటిని బయటకు పంపించాలి.


పైరు ఎరుపు... భాస్వర లోపం

నేలలో భాస్వరం ఎంత వరకూ ఉందో తెలుసుకోవడానికి కలోరి మీటర్‌ను ఉపయోగిస్తారు. ముఖ్యంగా వరి, మిరప, ఉల్లి ఇతర కూరగాయల పంటలకు 30 బస్తాల వరకూ రసాయనానికి ఎరువులు ఉపయోగిస్తే అటువంటి నేలలో ఎకరానికి 24 కిలోల కన్నా ఎక్కువ భాస్వరం ఉంటే బాగుంటుందని చెప్పవచ్చు. ఒకవేళ ఎకరాకు 150 కిలోల భాస్వరం ఎక్కువ ఉంటే మొక్కకు జింక్, ఇనుము అందకుండా చేస్తాయి. దీంతో పైరు ఎర్రగా మారుతుంది. అటువంటి సమయంలో పైపాటుగా కాంప్లెక్స్, డీఏపీ ఎరువులు వేయకూడదు. ప్రారంభంలో దుక్కిలో కొంత భాస్వరం వేసుకోవచ్చు. ప్రతి రైతు ఆరుతడి, తడి పైర్లకు ఎకరానికి 50 కిలోల పొటాష్‌ను వాడవచ్చు. వర్షాధారం కింద పొలాల్లో ఎకరాకు 25 కిలోల పొటాష్‌ను ఉపయోగించవచ్చు. నేలలో జింక్, ఇనుము, బోరాన్, మాంగనీస్, కాపర్ వంటివి తప్పని సరిగా ఉండాలి. వీటిని తెలుసుకోవడానికి ప్రత్యేక పరికరం ఉపయోగిస్తారు.

మట్టి నమూనా సేకరణ ఇలా...

- మట్టి నమూనా తీయాల్సిన చోట చెత్తాచెదారం లేకుండా చూడాలి. నాగలు సాలు పోయేలోతు వరకూ లేదంటే ఆరు అంగుళాల లోతు వరకు 'వి' ఆకారంలో తవ్వాలి. సేకరించిన నమూనాను శుభ్రమైన సంచిపై పోసి కలపాలి. కలిపిన మట్టిలో రాళ్లు, పంట వేర్లు, కొయ్యలు మొదలైన వాటిని తీసివేయాలి. మట్టి తడిగా ఉంటే నీడలో ఆరబెట్టాలి. కలిపిన మట్టిని నాలుగు భాగాలుగా విడదీయాలి. ఎదురెదురుగా రెండు భాగాలు ఉంచి మిగతావి తీసివేయాలి.
- ఈ మట్టిని శుభ్రమైన వస్త్ర సంచి లేకుంటే పాలిథిన్ సంచిలో నింపాలి. ఆ నమూనాను వ్యవసాయాధికారి ద్వారా సమీపంలోని భూసార పరీక్ష కేంద్రానికి పంపాలి.

రైతులకు అవగాహన పెరగాలి



భూసార పరీక్షపై రైతుల్లో అవగాహన పెరగాలి. మట్టి నమూనా పరీక్ష లేకుండా పంటల సాగు చేయరాదు. భూసార పరీక్షలు వేసవిలో చేస్తాం. రైతులు ఆ సమయంలో తమ పంట పొలాల్లో పరీక్షలు చేయించుకోవాలి. రాజమహేంద్రవరం మార్కెట్ యార్డ్‌లోని భూసార పరీక్ష కేంద్రంలో తీసుకువెళ్లిన మట్టి నమూనాతోపాటు నీటి పరీక్షలు చేస్తారు. అన్నీ ఉచితమే.

– కె.సూర్యరమేష్, మండల వ్యవసాయ అధికారి, సీతానగరం

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రాజానగరం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్లపై వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. దీనివల్ల రాజానగరం, సూర్యారావుపేట, జీఏస్ఎల్, బ్రిడ్జి కౌంటీ, గైట్, తూర్పుగానుగూడెం, పల్లకడియం, రామస్వామిపేట, ఐశ్వర్య రైస్ మిల్లు, సాక్షి ముద్రణా కార్యాలయం, ఐఎస్‌టీఎస్ ఇంజినీరింగ్ కాలేజ్ ఏరియాల్లోని అన్ని ఫీడర్లపై ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అఖండ దీపాలంకరణ


పందలపాకలో దీపాలంకరణ చేస్తున్న మహిళలు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని వెలంపేట రామాలయం వద్ద అయోధ్య రామమందిరం నిర్మించి ఏడాది పూర్తయిన సందర్భంగా అఖండ దీపాలంకరణ కార్యక్రమం జరిగింది. బుధవారం ఆలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం మహిళలు దీపాలంకరణ చేశారు. సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి భజనలు చేశారు. కార్యక్రమంలోని గొర్రిపోటి వెంకటరమణ, వెన్నల శివ, ఆదిరెడ్డి శ్రీను, కొల్లు దేవి, సులోచన, పార్వతి, ఆలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైట్‌లో ముగిసిన వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పైథాన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్లు

రాజానగరం: మండలంలోని భూపాలపట్నం, రైట్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన పైథాన్ వర్క్‌షాప్ బుధవారంతో ముగిసింది. రిసోర్స్‌పర్సన్లుగా నోయిడా, ఐఐటీలకు చెందిన లీడ్ ట్రైనర్ సతీష్ పడవల, సహాయ ట్రైనర్ శ్రీనివాస్ వ్యవహరించారు. పైథాన్ ప్రోగ్రామింగ్‌పై విద్యార్థులకు అవగాహన కలిగిస్తూ, సందేహాలను నివృత్తి చేశారు. హెచ్‌ఓడీ డాక్టర్ ఎం.శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

బాలిక అదృశ్యం

రంగంపేట: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట కృష్ణసాయి తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. కోటపాడు గ్రామానికి చెందిన బాలిక (16) తల్లి చనిపోవడంతో మేనమామ కృష్ణ ఇంటి వద్దే ఉంటుంది. ఈ నెల 19న ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాలిక ఆచూకీ తెలిస్తే రంగంపేట పోలీస్ స్టేషన్లో గాని, 94409 04854 ఫోన్ నంబర్లో గాని తెలపాలన్నారు.

ఘనంగా గొంతేలమ్మ జాతర

రాజమహేంద్రవరం రూరల్: వెంకటనగరం గ్రామ దేవత గొంతేలమ్మ జాతర మహోత్సవం మూడో రోజు బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కోబ్రా డ్యాన్స్, కేరళా వాయిద్యాలు, గారడీ నృత్యాలు ఆహూతులను అలరించాయి. లక్ష్మీ లేబర్ కాంట్రాక్టర్ కోఆపరేటివ్ సొసైటీ, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి ప్రదాత మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఉప్పులూరి వీరవెంకట సత్యనారాయణను గ్రామ ప్రజలు ఘనంగా సత్కరించారు. ఆయనను పూలమాలలతో సత్కరించారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా నిలుస్తూ, గ్రామంలో ఆలయాల నిర్మాణంతో పాటు, గ్రామాభివృద్ధికి స్వీయ నిధులతో ఎనలేని సేవలందించిన సత్యనారాయణ రుణం తీర్చుకోలేనిదని గ్రామ పెద్దలు అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, లక్ష్మీ లేబర్ కాంట్రాక్టర్ కో ఆపరేటివ్ సొసైటీ, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఆయన సోదరులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, రామవరం గ్రామ ఉప సర్పంచ్ మాతృమూర్తి సబ్బెళ్ల బాపాయమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని, కృష్ణారెడ్డి సోదరులు శ్రీనివాసారెడ్డి, వెంకటకృష్ణారెడ్డిలను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు బుధవారం పరామర్శించారు. అలాగే పెదపూడి జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, అనపర్తి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి ధర్మారెడ్డి, మధుమేహ వ్యాధి వైద్య నిపుణుడు తాడి రామగుర్రెడ్డి, పుట్టకొండ, అనపర్తి, ఇళ్లపల్లి, పెద్దాడ, రంగాపురం సర్పంచులు వల్లు వెంకటరమణ, వారా కుమారి, లొల్ల భద్రం, డొకుబుర్ర మీనాక్షి, భద్రం తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పశువుల సంరక్షణపై అవగాహన అవసరం

పెదపూడి: పాడి పశువుల సంరక్షణపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల పశు వైద్యాధికారి సాయికృష్ణ అన్నారు. బుధవారం పెదపూడిలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 600 పశువులకు ఆయన టీకాలు వేశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ నట్టల నివారణ మందు, దూడలకు ఏలుక పాముల మందు, కోళ్లకు టీకాలు, గర్భకోస వ్యాధుల నిర్ధారణ, చూడి పరీక్షలు, పెయ్యి దూడలు పుట్టే అధునాతన ఇంజెక్షన్లపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పశువులు త్వరగా గర్భధారణ పొందడానికి అవసరమైన మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, రైతు కోరా బాబి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: రైతులు పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని అనపర్తి పశుసంవర్ధక శాఖ ఏడీ వై.శ్రీనివాసరావు అన్నారు. ఇల్లపల్లిలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 22 మంది రైతులకు చెందిన 30 పశువులు, 33 దూడలు, 200 గొర్రెలు, మేకలకు వైద్య సేవలు అందించారు. ఏడీ మాట్లాడుతూ పశువులకు నట్టల నివారణ మందులు, పశు వ్యాధి చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, సన్నజీవాలకు టీకాలు వేస్తున్నామన్నారు. పశు వైద్యులు ప్రణీత్, వీర్రాజు, ఏహెచ్ఏ దివ్య, రాకేష్, తణుకు శ్రీధర్ పాల్గొన్నారు.



ఇల్లపల్లిలో పాడి రైతులకు మందులు అందిస్తున్న పశు వైద్యులు

సీతానగరం: పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మక్కిన వెంకటేశ్వరరావు సూచించారు. ములకల్లంకలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు మండల పశు వైద్యాధికారి ఎ.ఫణీంద్ర వైద్య సేవలు అందించారు. 84 పశువులు, 250 మేకలు, గొర్రెలకు సేవలందించారు. పాడి రైతులకు పశువుల మందులను వెంకటేశ్వరరావు ఉచితంగా పంపిణీ చేశారు. సర్పంచ్ పోలిన గోవిందరాజులు, వీపీ ఆదిలక్ష్మి, ఏహెచ్ఏలు అంగర సాయి, చిలకమ్మ, సోశీల్య, బుజ్జమ్మ పాల్గొన్నారు.


ములకల్లంకలో మందులను అందిస్తున్న పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు

మధురపూడి: పాడి పశులకు వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి. ప్రభావతి అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలు అంశాలపై పాడి రైతులకు డాక్టర్ ప్రభావతి అవగాహన కల్పించారు. అనంతరం 76 పశువులు, 160 మేకలకు సేవలు అందించారు. నాయకులు మార్ని రాము, సూదిన సుబ్బారావు, కర్రి రాజారావు, పశు వైద్యశాల డాక్టర్ వనిత, సావిత్రిరాణి తదితరులు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదు చేయించుకోండి

రాజానగరం: రబీలో సాగు చేసే రైతులంతా ఈ-పంట నమోదు, ఈకేవైసీలను తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్‌కే ఇమామి ఖాసిమ్ రైతులకు సూచించారు. మండలంలోని మల్లంపూడి, ముక్కినాడలలో బుధవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంట క్షేత్రాలను పరిశీలించి, రైతులకు సస్యరక్షణ చర్యలపై సూచనలిచ్చారు. ప్రస్తుతం వరి పంట పిలకలు వేసే దశలో ఉందని, ఈ సమయంలో తెగుళ్ల బెడద తక్కువగా ఉన్నప్పటికీ అవసరమైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఎరువులను ఇష్టానుసారంగా వాడకుండా, తగు మోతాదులో ఉపయోగించాలన్నారు. అలాగే దోమకాటు నుంచి పంటను రక్షించుకునేందుకు ప్రస్తుతం పొలంలో నీరు నిల్వ లేకుండా చూడాలని, ఆపై దోమల నివారణకు వరి మొదళ్లు బాగా తడిచే విధంగా సూచించే మందులను పిచికారీ చేయాలన్నారు. ఎసిఫేట్ 75 ఎస్‌పీ 1.5 గ్రాములు, ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. లేకుంటే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఒక ఎకరానికి 4 నుంచి 5 కిలోల వరకూ చల్లాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


మల్లంపూడిలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

రాజానగరం: వినియోగదారుల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్‌బాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు జీఎస్టీతో కూడిన బిల్లును తీసుకోవాలన్నారు. మోసం జరిగిన వెంటనే వినియోగదారుల ఫోరమ్‌లో ఫిర్యాదు చేసి, సత్వర న్యాయం పొందవచ్చన్నారు. జిల్లా వినియోగదారుల రక్షణ మండలి (డీసీపీసీ) సభ్యులు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం- 2019లో ఈ కామర్స్, మీడియోషన్, వీడియో కాన్ఫరెన్సింగ్ తదితర అంశాలు క్రోడీకరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, ఐసీడీఎస్, విద్యా, పోలీసు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్‌బాబు

రాత పరీక్ష రద్దు చేయాలి

రంగంపేట: రేషన్ డిపోల కేటాయింపునకు నిర్వహించిన రాత పరీక్ష విధానంలో అవకతవకలు జరిగాయని, దానిని రద్దు చేసి తిరిగి నిష్పక్షపాతంగా నిర్వహించాలని దొడ్డిగుంట గ్రామానికి చెందిన చంద్రమళ్ల సూర్యారావు కోరారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించి మాట్లాడారు. దొడ్డిగుంటలో రేషన్ షాపు నంబరు 19 బీసీ-డీకు, రేషన్ షాపు నంబరు 20 ఓసీ మహిళకు కేటాయించారని, ఈ సామాజిక వర్గానికి చెందిన వారు లేకపోతే ప్రత్యేక ప్రతిభావంతులకు కేటాయించే అవకాశం ఉండడంతో తాను దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. అయితే తన దరఖాస్తును వివక్ష పూర్వకంగా తిరస్కరించి ఆర్డీఓ కార్యాలయం లిస్టులో రిజెక్టు చేసిన వారికి రాత పరీక్ష నిర్వహించారని ఆరోపించారు. ఈ విషయమై అధికారులు స్పందించి నిష్పక్షపాతంగా రాత పరీక్ష నిర్వహించాలని కోరారు.


డీటీ రంజిత్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న సూర్యారావు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

రంగంపేట: శ్రీరాముడు జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకుని ఉత్తమ జీవితాన్ని గడపడానికి నిరంతర ఆధ్యాత్మిక సాధన చేయాలని స్థానిక దేవిబాల భక్త భజన సమాజం గురువు, గ్రామ మాజీ ఉప సర్పంచ్ పోతుల వీరన్న సూచించారు. బుధవారం రంగంపేట పాతూరు రామాలయం వద్ద అయోధ్య రామ మందిరంలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఎంతో మంది త్యాగ ధనుల కృషి ఫలితంగా నిర్మించిన అయోధ్య రామ మందిరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అలాగే రామాలయంలో ప్రత్యేక పూజలు, భజనలు చేసి శ్రీరాముడి కీర్తిని మరింత చాటే విధంగా హిందూ బంధువులు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా బాల రాముని చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి భజనలు చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు మండవిల్లి గుప్తా, గారపాటి నరసింహారావు, యలమాటి సత్తిబాబు, కంటిపూడి చిట్టోడు, శిరిగిన నాగమణి పాల్గొన్నారు.


రంగంపేటలో బాల రాముడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ప్రత్యామ్నాయ పంటలతో లాభాలు

మధురపూడి: రబీ సీజన్‌లో వరి, మొక్కజొన్న, అపరాలకు ప్రత్యామ్నాయంగా పసుపు, అశ్వగంధ, ఆముదం, మిరప వాణిజ్య పంటలను పండిస్తే లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయశాఖ ఏరువాక కేంద్రం రాజమహేంద్రవరం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో పంటల వైవిధ్యంపై శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతన్నలు ఆర్థిక పరిపుష్టి సాధించాలంటే కొత్త పంటలను వేయాలన్నారు. రబీలో వరికి కాండం తొలిచే పురుగు తల్లి పురుగుల గుడ్ల సముదాయాలు కనిపిస్తున్నట్టు గమనించామన్నారు. వాటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నారుమడిలో కాండం తొలిచే పురుగు, వాటి గుడ్లు కనిపిస్తున్నందున సస్యరక్షణ చర్యలతోపాటు, మడిలో నాట్లు వేసే ముందు, నారు కొనలు తుంచి నాటుకోవాలన్నారు. డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ మొక్కజొన్న సాగులో మెళకువలను వివరించారు. ఆ శాఖ ఏడీ మల్లికార్జునరావు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, అగ్రి ల్యాబ్ ఏఓ రామతులసి తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న సాగులో మెళకువలు తెలియజేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

బాధితుడికి భూమి అప్పగించండి

జేసీ చినరాముడు

రంగంపేట: భూమి కోల్పోయిన బాధితుడికి సర్వే చేసి భూమి అప్పగించాలని జాయింట్ కలెక్టర్ ఎస్. చినరాముడు రెవెన్యూ అధికారులకు సూచించారు. రంగంపేట మండలం వడిశలేరు గ్రామానికి చెందిన రైతు ఉండవల్లి శ్రీనివాసరావు తనకు చెందిన 15 సెంట్ల భూమి నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా సేకరించిన భూమిలో కలసిపోయినట్టు రెవెన్యూ రికార్డుల్లో నమోదు కావడంతో ఇటీవల ప్రజా పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా బుధవారం జాయింట్ కలెక్టర్ చినరాముడు వడిశలేరు గ్రామానికి వచ్చారు. ఫిర్యాదుదారుడు శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బందితో కలసి భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా భూమికి భూమి వేరే చోట ఇస్తామని శ్రీనివాసరావుకి జేసీ తెలపడంతో ఆయన అంగీకరించకపోవడంతో రీ సర్వే చేసి అతని భూమి అతనికి అప్పగించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోసు అనసూయ, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


వడిశలేరులో భూమిని పరిశీలిస్తున్న జేసీ చినరాముడు

ఇంటింటా సర్వే


పందలపాకలో సర్వే చేస్తున్న ఎన్ఎస్ఎస్ఓ ప్రతినిధి జానకిరాముడు

బిక్కవోలు: పందలపాకలో బుధవారం జాతీయ గణాంక సర్వే చేశారు. ఎన్ఎస్ఎస్ఓ ప్రతినిధులు ఇంటింటా తిరిగి ఉద్యోగులు, నిరుద్యోగుల వివరాలు సేకరించారు. సమర్థవంతమైన ప్రణాళికలు, పథకాలు రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ గణాంక సర్వే చేస్తున్నారు. శ్రామికశక్తి అంచనా వేయడానికి ఉద్యోగం- నిరుద్యోగం అంశంపై ప్రతి ఏడాది సర్వే జరుగుతుందని ఆ ప్రతినిధి జానకిరాముడు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఓగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వినాయకునికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సంపర సిద్ధి వినాయకుడు

పెదపూడి: సంపర గ్రామంలోని పంట కాలువ సమీపంలో సిద్ధి వినాయకుని ఆలయంలో స్వామివారికి బుధవారం గరికపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి


సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వీణాదేవి

సీతానగరం: ఆయా శాఖల అధికారులు తమకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని డీఎల్‌డీఓ పి.వీణాదేవి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెలుగు, అంగన్‌వాడీ తదితర శాఖల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో పనులు ఎంత వరకూ పూర్తయ్యాయని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. మండలంలో కాలనీలో 1,013 ఇళ్లు హౌసింగ్‌లో ఉండగా, ఇందులో 290 పూర్తయ్యాయని, మిగిలినవి పూర్తి చేయాల్సి ఉందని హౌసింగ్ ఏఈ నాగచక్రం వివరించారు. ఇళ్ల నిర్మాణం మార్చి నెలాఖరుకు పూర్తికాని పక్షంలో బిల్లులు రావడం కష్టమని, సత్వరమే ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని డీఎల్‌పీఓ అన్నారు. ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని, వంద రోజుల పనిదినాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం డీఎల్‌డీఓ వీణాదేవి మాట్లాడుతూ గోకులం పశువుల షెడ్‌ల నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో రోడ్లను తక్షణం నిర్మించాలన్నారు. ఏపీఓ నాగ శేషవేణి, ఎంపీడీఓ ఎం.భారతి, ఈఓపీఆర్డీ కేవీఎస్ఎస్ఎస్ మూర్తి, ఏపీఎం జిలానీ, పీఆర్ ఇన్‌చార్జి ఏఈ జోయల్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి


దొడ్డిగుంటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

రంగంపేట: రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.శ్రీనివాసరావు సూచించారు. దొడ్డిగుంట గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన అధికారులు పంటలను పరిశీలించి, అనంతరం రైతులతో మాట్లాడారు. ఏఓ శ్రీనివారావు మాట్లాడుతూ పంట నమోదు ఆవశ్యకతను వివరించారు. వివిధ పంటల్లో వచ్చే చీడపీడల నివారణకు ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న సూడోమోనాస్ మందు గ్రామాల్లోని ప్రతి రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందన్నారు. మండల ఉద్యాన అధికారి కె.దివ్యశ్రీ మాట్లాడుతూ ప్రస్తుతం మామిడిలో వివిధ పురుగులు, తెగుళ్ల వాటి నివారణ చర్యలు వివరించారు. పూత నిలబడటానికి, కాయ రాలడం నివారణకు ప్లానోఫిక్స్ 0.2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ అరవింద్‌సాయి, వీహెచ్ఏ వీరబాబు, రైతులు పాల్గొన్నారు.

సారా బట్టీ ధ్వంసం

సీతానగరం: అచ్చయ్యపాలెం శివారున సారా తయారీ, రవాణా చేస్తున్న కుక్క వెంకటరమణను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు హెడ్ కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు తెలిపారు. చీపురపల్లి పంచాయతీ పరిధి అచ్చయ్యపాలెం శివారున బుధవారం ఉదయం సారా బట్టీపై దాడి చేసి 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. 100 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వెంకట రమణను అరెస్ట్ చేశామని అన్నారు.